సాక్షి
మంచిర్యాల
గురువారం । 16 । మే । 2024



అండగా దోస్త్.. కోర్సులు మస్త్
ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తు ప్రక్రియ కొనసాగుతోంది. ఈ నెల 20 నుంచి 30వరకు వెబ్ ఆప్షన్స్ ఇవ్వాల్సి ఉంది. 8లో

పరిశుభ్రతే మహాభాగ్యం
ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి. నిల్వ నీటిలో దోమలు వృద్ధి చెంది వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉంది. నేడు డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా కథనం. 8లో



గరిష్టం/కనిష్టం
38.0 /28.0
వాతావరణం
ఆకాశం ఉదయం వేళ పాక్షికంగా, రాత్రివేళ పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. వేడిగాలులు వీస్తాయి. ఉక్కపోతగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి.

న్యూస్‌రీల్

ఇంచార్జీ డీసీఎస్‌వోగా హరికృష్ణ



బాధ్యతలు స్వీకరిస్తున్న ఆర్డీవో హరికృష్ణ

మంచిర్యాలఅగ్రికల్చర్: ఇంచార్జీ జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి(డీసీఎస్‌వో)గా బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ బుధవారం జిల్లా పౌరసరఫరాల శాఖ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. గత కొన్ని నెలల క్రితమే జిల్లాకు వచ్చిన జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి వాజిద్ అలీ విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఈ నెల 12న రాష్ట్ర పౌరసరఫరాల కమిషనర్ డీఎస్ చౌహాన్ సస్పెండ్ చేశారు. ఇంచార్జీ బాధ్యతలు బెల్లంపల్లి ఆర్డీవోకు అప్పగించారు.

సమాన విద్యతో దేశాభివృద్ధి



మాట్లాడుతున్న లింగారెడ్డి

మంచిర్యాలఅర్బన్: అశాస్త్రీయమైన విద్య విధానాలతో దేశం తిరోగమనంలోకి వెళ్తుందని, సమాన విద్య దేశ అభివృద్ధికి తోడ్పడుతుందని డీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లింగారెడ్డి అన్నారు. బుధవారం స్థానిక ఎస్వీ హాల్‌లో డీటీఎఫ్ జిల్లా సదస్సు, మధ్యంతర కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. రాష్ట్ర అకాడమీ సెల్ కన్వీనర్ రామకృష్ణ, డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రమేష్, ప్రధాన కార్యదర్శి జయకృష్ణ, ఉపాధ్యక్షుడు కుమార్, కార్యదర్శులు ప్రకాశ్, అప్పారావు, రాష్ట్ర కార్యదర్శి షామిల్, పూర్వ జిల్లా అధ్యక్షుడు కొండయ్య పాల్గొన్నారు.

నేడు బీఆర్‌ఎస్ నిరసన

చెన్నూర్: రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు వ్యతిరేక విధానాలపై బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో గురువారం జిల్లాలోని నియోజకవర్గ కేంద్రాల్లో నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్ తెలిపారు. రైతాంగానికి రూ.500 బోనస్ ఇస్తామని ప్రకటించి నేడు సన్న వరి ధాన్యం వేసిన రైతులకు మాత్రమే ఇస్తామని ప్రకటించడం దారుణమని పేర్కొన్నారు. రైతులు, రైతు సమన్వయ సమితి జిల్లా, నియోజకవర్గ, మండల అధ్యక్షులు, కార్యదర్శులు, బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని కోరారు.

పెళ్లి బంధం బలహీనం..!

విడాకులు రాయించుకుని మరో పెళ్లి...

కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాకు చెందిన శిరీష, ప్రభుత్వ ఉద్యోగి రాజేష్(పేర్లు మార్చాం)కు వివాహం జరిగింది. ఆ తర్వాత శిరీషకు టీచర్ ఉద్యోగం వచ్చింది. వీరికి ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. కొంతకాలం తర్వాత రాజేష్ మరో మహిళతో వివాహేతర సంబంధం ఏర్పర్చుకున్నాడు. భార్యను వేధింపులు, భయభ్రాంతులకు గురి చేసి విడాకుల పత్రం రాయించుకుని దగ్గర పెట్టుకుని కలిసే ఉంటున్నారు. పెద్ద కూతురుకు ఇద్దరు కలిసే వివాహం చేశారు. ఆ తర్వాత కొద్ది రోజులకు శిరీష మంచిర్యాల జిల్లాకు బదిలీపై వచ్చి ఇక్కడే ఉంటోంది. తరచూ వచ్చి వెళ్తుండేవాడు. కొంతకాలనికి రాజేష్ ఓ మహిళను వివాహం చేసుకున్నాడని తెలిసి ఇంటికి వెళ్లి గొడవ చేసింది. పెద్ద మనుషుల పంచాయితీ నిర్వహించగా.. శిరీషదే తప్పని, విడాకులు రాసిచ్చి మళ్లీ ఎదురు తిరుగుతోందని చెప్పడంతో మహిళా పోలీసుస్టేషన్‌ను ఆశ్రయించింది.

భర్తను మోసం చేసి..

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లికి చెందిన గీత, అదే ప్రాంతానికి చెందిన విజయ్(పేర్లు మార్చాం)కు పెద్దల సమక్షంలో వివాహం జరిగింది. పెళ్లయిన వారం రోజులకే తమ ఊరిలో స్నేహితురాలి పెళ్లి ఉందని ఇంట్లోని నగలన్నీ తీసుకెళ్లి పెళ్లికి ముందు ప్రేమించిన మరో యువకుడిని పెళ్లి చేసుకుంది. విషయం తెలియని విజయ్ పోలీసు స్టేషన్‌లో మిస్సింగ్ కేసు పెట్టాడు. పోలీసులు గాలించి గీతతోపాటు ఆమె ప్రేమికుడిని పట్టుకున్నారు. విజయ్ వారిద్దరిపై కేసు పెట్టాడు. మూడేళ్ల తర్వాత గీత విజయ్‌పై 498ఏ కేసు పెట్టింది. పోలీసులు దీన్ని ఫాల్స్ చేశారు. కానీ గీత కోర్టు నుంచి కేసును రీ ఓపెన్ చేయించింది. పెళ్లి చేసుకున్న భర్తను మోసగించి ప్రేమించిన వాడిని పెళ్లి చేసుకుని కోర్టు మెట్లెక్కించింది.

- చిన్న చిన్న కారణాలకే కోర్టు మెట్లెక్కుతున్న దంపతులు
- చిచ్చురేపుతున్న అనుమానాలు
- తారాస్థాయికి చేరుతున్న మనస్పర్థలు
- కౌన్సెలింగ్‌లోనూ మారని తీరు



మంచిర్యాలక్రైం: మూడు ముళ్లు.. ఏడడుగులతో ముడిపడిన వివాహ బంధం చిన్న చిన్న విషయాలకే బలహీనమవుతోంది. ఒక్కోసారి విడిపోయేందుకు జంట కోర్టు మెట్లెక్కుతోంది. సర్దిచెప్పాల్సిన ఇరు కుటుంబాల పెద్దలు ఒక్కోసారి భార్యాభర్తల మధ్య మరింత ఆజ్యం పోస్తున్నారు. కడదాకా కలిసి ఉంటామనే పెళ్లి నాటి బాసలను అపహాస్యం చేస్తూ ఏడాది తిరక్కముందే భార్యాభర్తలు విడాకులకు పెద్దలను ఆశ్రయిస్తున్నారు. వారు కాదంటే కోర్టు మెట్లెక్కి జీవితాన్ని అంధకారం చేసుకుంటున్నారు. జిల్లాలో చిన్న చిన్న తగాదాలకే పోలీసుస్టేషన్ల వరకు వెళ్లే దంపతుల సంఖ్య పెరుగుతోంది. 2023 నుంచి 2024 ఏప్రిల్ వరకు 388మంది భార్యాభర్తలు పోలీసుస్టేషన్‌ను ఆశ్రయించగా.. కలిసి ఉండడానికి ఇష్టపడని మరో 73జంటలు కోర్టు మెట్లెక్కాయి. పోలీసుస్టేషన్లకు వస్తున్న ఫిర్యాదుల్లో ఎక్కువ శాతం 30ఏళ్లలోపు వారే ఉండడం ఆందోళన కలిగిస్తోంది. గొడవ పడే దంపతుల్లో ఎవరూ వెనక్కి తగ్గేందుకు ఇష్టపడడం లేదు. పెళ్లయిన యువతులు కొత్త కాపురంలోకి అడుగు పెట్టగానే అప్పటివరకు ఊహించుకున్నవి గాలిమేడలనే అభిప్రాయానికి వస్తున్నారు. పుట్టినరోజును మర్చిపోవడం, పండుగకు పుట్టింటికి పంపలేదని వంటి చిన్న కారణాలతో రాద్ధాంతం చేసుకునే వరకు వెళ్తున్నారు. ఒక్కోసారి వారు గుర్తించలేనంత స్థాయిలో అగ్నికి ఆజ్యం పోసేలా మూడో శత్రువు ప్రవేశిస్తున్నట్లు పోలీసులు పేర్కొంటున్నారు. స్నేహితులు, బంధువులు, ఇరుగుపొరుగులో సఖ్యతగా ఉండే ఎవరో ఒకరు లేనిపోని అనుమానాలు పెంచుతున్నారు. అది నిజమా..? కాదా..? అని ఆలోచించకుండానే దంపతులు ఒకరిపైనొకరు ద్వేషం పెంచుకుంటున్నారు. ఇలాంటి జంటలకు కౌన్సెలింగ్ ఇస్తున్నా మార్పు రాకపోవడం వల్ల సంసారంలో కలతలు పెద్దవై విడాకుల వరకు వెళ్తున్నారు.

మంచిర్యాల మహిళా పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసుల వివరాలు

సంవత్సరం	ఫిర్యాదులు	కౌన్సెలింగ్	ఎఫ్ఐఆర్	పెండింగ్
2023	315	252	63	00
2024ఏప్రిల్ వరకు	73	57	10	6

పోలీసులు ఏం చెబుతున్నారంటే..

కాపురంలో భరించలేనంత ఆర్థిక ఇబ్బందులేమీ కనిపించవు. కానీ ఒకరికొకరు బద్ధశత్రువుల్లా భావిస్తున్నారు. తీవ్రమైన నిర్ణయానికి వస్తున్న దంపతుల్లో అధిక శాతం పెళ్లయిన ఏడాది నుంచి నాలుగేళ్లలోపు వారే ఎక్కువగా ఉంటున్నారు. విడాకులకు చెప్పే కారణాలు చాలా చిన్నవిగా ఉంటున్నట్లు కౌన్సెలింగ్ నిపుణులు పేర్కొంటున్నారు. ఉన్నత విద్యావంతులైన భార్యాభర్తలు కూడా ఎవరి స్వేచ్ఛ వారిదే అనే పద్ధతిలో పంతాలకు పోతున్నట్లు పోలీసులు అభిప్రాయపడుతున్నారు.

ప్రేమ వివాహాలు చేసుకున్న వారే అధికం

పోలీసుస్టేషన్లను ఆశ్రయిస్తున్న వారిలో ప్రేమ వివాహాలు చేసుకున్న వారే ఎక్కువ ఉంటున్నారు. యుక్త వయస్సులో ఆకర్షణకు లోనై ప్రేమలో పడి పెళ్లి చేసుకుంటున్నారు. పిల్లలు పుట్టిన తర్వాత సమస్యలు ఎదురై కలహాలు ఏర్పడుతున్నాయి. ముందే ప్రేమికులు కావడంతో స్వేచ్ఛ ఎక్కువగా ఉంటుంది. ఈ కారణంతో భార్యాభర్తలు పంతాలకు వెళ్తున్నారు.

విభేదాలకు కారణాలు

- మద్యం కారణంగా జరిగే గొడవలు : 33 శాతం
- వరకట్న వేధింపులు : 31శాతం
- వివాహేతర సంబంధాలు/ అనుమానాలు : 26 శాతం
- మగపిల్లలు పుట్టలేదని/సంతానం కలగడం లేదని : 5 శాతం
- ఇతర కారణాలు : 5 శాతం

మనస్పర్థలు పెంచుకుంటున్నారు..



చిన్న చిన్న కారణాలకే దంపతుల మధ్య మనస్పర్థలు పెరిగి గొడవలకు దారి తీస్తోంది. ఇరువురు పోలీసులను ఆశ్రయిస్తున్నారు. ఇరు కుటుంబాల సభ్యులతో మాట్లాడి కౌన్సెలింగ్ ఇస్తూ చాలామందిలో మార్పు తీసుకొస్తున్నాం. అయినా కొందరు కోర్టు వరకు వెళ్తూ విడాకులు తీసుకుంటున్నారు. పలు సమస్యలతో దంపతుల మధ్య సఖ్యత తగ్గి పోలీస్‌స్టేషన్ వరకు వస్తున్నారు.
– వెంకటనర్సయ్య, సీఐ, మహిళా పోలీస్‌స్టేషన్, మంచిర్యాల

కుటుంబ వ్యవస్థపై అవగాహన ఉండాలి



ప్రస్తుత పరిస్థితుల్లో యువ జంటలకు కుటుంబ వ్యవస్థపై అవగాహన, సర్దుబాటు ధోరణి లేకపోవడం వల్లనే విడాకుల కోసం కోర్టును ఆశ్రయిస్తున్నారు. తల్లిదండ్రుల పెంపక లోపం, ఆర్థిక స్వేచ్ఛ, అహంకారం, వివాహేతర సంబంధాలు కూడా విడాకులకు కారణమవుతున్నాయి.
– ప్రేమలత, అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మంచిర్యాల

స్ట్రాంగ్ రూంల వద్ద పకడ్బందీగా ఏర్పాట్లు

- జిల్లా ఎన్నికల అధికారి సంతోష్



స్ట్రాంగ్ రూం వద్ద భద్రతను సమీక్షిస్తున్న సంతోష్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం ముల్కల్ల గ్రామ శివారులోని ఐజా కళాశాలలో పార్లమెంటు ఎన్నికలకు సంబంధించి ఈవీఎంలు భద్రపర్చిన స్ట్రాంగ్ రూముల వద్ద పకడ్బందీగా భద్రత ఏర్పాట్లు చేశామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సంతోష్ తెలిపారు. బుధవారం ముల్కల్ల లెక్కింపు కేంద్రంలో భద్రత ఏర్పాట్లు, పరిసరాలు ప్రత్యక్షంగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. సీసీ కెమెరాల పనితీరు, కంట్రోల్ రూం, మీడియా సెంటర్‌లను పర్యవేక్షించారు. జూన్ 4న ఓట్ల లెక్కంపు ఉంటుందని, పూర్తయ్యే వరకు బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్‌లతోపాటు పోస్టల్ బ్యాలెట్ పేపర్లు, మాక్ పోల్ ధ్రువపత్రాలు, పీఓ డైరీ, టెండర్ బ్యాలెట్ పేపర్లు తదితర ఎన్నికల సామగ్రిని అంతా కూడా స్ట్రాంగ్ రూముల్లో భద్రపర్చగా వాటి రక్షణకు నిరంతరం పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు. జూన్ 6 వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందని తెలిపారు. నోడల్ అధికారి గంగారాం, హాజీపూర్ తహసీల్దార్ సతీశ్‌కుమార్ పాల్గొన్నారు.

కొనుగోలు చేసిన ధాన్యం తరలించాలి



కాంబోజీపేటలో రిజిష్టర్లు పరిశీలన

చెన్నూర్‌రూరల్: రైతుల వద్ద కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలని ఇంచార్జీ జిల్లా సివిల్ సప్లయి అధికారి హరికృష్ణ కేంద్రాల నిర్వాహకులకు సూచించారు. మండలంలోని ఆస్నాద, కాంబోజీపేట, లింగంపల్లి, కిష్టంపేట, సుబ్బరాంపల్లి గ్రామాల్లోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం ఆయన సందర్శించారు. రిజిష్టర్లు, ధాన్యం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతుల నుంచి నాణ్యమైన ధాన్యం కొనుగోలు చేయాలని, బస్తా బరువు 41కిలోలు మాత్రమే కాంటా చేయాలని, ఎక్కువ కాంటా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. టాబ్‌లో రైతుల నమోదు వెంటనే చేయాలని, రైతులకు 48గంటల్లో నగదు జమ అయ్యేలా చూడాలని ఆదేశించారు. డీఎం గోపాల్, డీటీ మధుసూదన్, సహకార సంఘం సీఈవో లక్ష్మణ్‌రెడ్డి పాల్గొన్నారు.

శతశాతం ఏది?



హాజీపూర్ మండలం ముల్కల్ల పోలింగ్ కేంద్రంలో ఓటర్ల బారులు(ఫైల్)

- జిల్లాలో 66 శాతమే పోలింగ్ నమోదు
- చాలా చోట్ల 50శాతంలోపే ఓటింగ్
- 2.34లక్షల మంది ఓటుకు దూరం
- ప్రచారం చేసినా కనిపించని ఫలితం

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు కలిగిన ప్రతీ పౌరుడు కనీస బాధ్యతగా ఓటియ్యాలని అధికారులు విస్తృతంగా ప్రచారం చేసినా జిల్లా ఓటర్లు కొందరు బద్ధకించారు. జిల్లాలో మొత్తం ఓటర్లలో 33శాతం మంది ఓటుకు దూరంగా ఉన్నారు. సంఖ్యా పరంగా చూస్తే 2.34లక్షల మంది ఓటు హక్కును వినియోగించుకోలేదు. పెద్దపల్లి లోక్‌సభ నియోజకవర్గ పరిధి మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూర్ అసెంబ్లీ నియోజకవర్గాలు, ఆదిలాబాద్ లోక్‌సభ పరిధి ఖానాపూర్ నియోజకవర్గం జన్నారం మండల ఓటర్లలో చాలా చోట్ల పోలింగ్ అనుకున్న లక్ష్యాన్ని చేరుకోలేదు. గ్రామీణ ప్రాంతాల్లో కాస్త మెరుగ్గా ఓట్లు వేయగా, పట్టణ ప్రాంతాల్లో మాత్రం అందుకు భిన్నంగా ఉంది.

ఓటుకు వచ్చి వెనుదిరిగి..

జిల్లా మావోయిస్టు ప్రభావిత ప్రాంతంగా ఉండడంతో నాలుగు గంటల వరకే పోలింగ్‌కు అనుమతి ఉంది. దీనిపై అందరికీ అవగాహన కల్పించినప్పటికీ కొందరు నాలుగు గంటల తర్వాత ఓటేసేందుకు వచ్చి ఓట్లు వేయలేక వెనుదిరిగారు. ఆ సమయంలో పోలీసులు, ఎన్నికల సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. కాస్త ముందు వచ్చి ఉంటే అనుమతి ఇచ్చేవారని, నిబంధనల ప్రకారం సమయం దాటితే ఓట్లు వేయరాదని అధికారులు తిప్పి పంపారు. ఆదిలాబాద్ లోక్‌సభ పరిధిలో ఉన్న జన్నారం మండలంలో సాయంత్రం 6గంటల వరకు పోలింగ్‌కు అనుమతి ఉంది. రెండు గంటలు అదనంగా ఆ మండలంలో సమయం ఉన్నప్పటికీ 69.35శాతమే పోలింగ్ నమోదైంది. ఇక వంద శాతం ఓటింగ్ లక్ష్యంగా ఏర్పాటు చేసిన మోడల్ పోలింగ్ కేంద్రాల్లోనూ ఎక్కడా శత శాతానికి చేరుకోలేదు. మంచిర్యాల, నస్పూర్, లక్సెట్టిపేట, రామక్రిష్టాపూర్ పట్టణాల్లో చాలా చోట్ల 40శాతం లోపే ఓటింగ్ నమోదైంది.

వలస ఓటర్లు దూరం

ప్రజల ప్రతినిధులుగా చట్టసభలకు పంపేందుకు నిర్ణయాత్మకంగా భావించే ఓటు హక్కు వినియోగంపై జిల్లా అధికారులు పలు రకాలుగా ప్రచారం చేశారు. ప్రజలంతా ఓటును తమ బాధ్యతగా భావించాలని కోరారు. పల్లెల్లో కన్నా పట్టణ ఓటర్లే అధికంగా గైర్హాజరయ్యారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓటర్లను నాయకులు పిలిపించి, ఖర్చులు భరించి ఓట్లు వేయించారు. ఈసారి వలస ఓటర్లపై ఎవరూ దృష్టి సారించకపోవడంతో విద్య, ఉద్యోగ, ఉపాధి కోసం వెళ్లిన వారంతా ఓటుకు దూరంగానే ఉన్నారు. ఎన్నికల సంఘం సెలవు ప్రకటించినా కొందరు స్వస్థలాలకు వచ్చి ఓటేసేందుకు ఆసక్తి చూపలేదు. సొంతూరులో ఓటు వేయలేకపోతే తాము ఉన్న చోటుకు ఓటును మార్చించుకునే అవకాశం ఉంది. చాలామంది స్థానికంగా ఓటు కలిగి ఉండి, వచ్చి ఓటు వేయలేకపోవడంతో వందశాతం పోలింగ్ చేరుకోవడం కష్టంగా మారింది. జిల్లాలోని మూడు ప్రధాన నియోజకవర్గాల్లో 3,21,366 మంది పురుష ఓటర్లు ఉండగా, 2,15,773 మంది మాత్రమే ఓటేశారు. మొత్తంగా 1,05,593 మంది ఓటుకు దూరంగా ఉన్నారు. ఇక మహిళా ఓటర్లు చూస్తే మొత్తం 3,27,619మంది ఓటర్లు ఉండగా, 2,11,851మంది మహిళలు ఓటేయగా, 1,15,768మంది మహిళలు పోలింగ్‌లో పాల్గొనలేదు.

నియోజకవర్గం	మొత్తం ఓట్లు	పోలైనవి	శాతం
మంచిర్యాల	2,78,738	1,69,591	60.84
చెన్నూరు	1,93,778	1,32,787	68.53
బెల్లంపల్లి	1,76,514	1,25,255	70.96
ఖానాపూర్(జన్నారం)	43,337	30,055	69.35
మొత్తం	6,92,367	4,57,688	66.10



ధాన్యం సేకరణ సగమే..



చెన్నూర్ మండలం కాచపల్లిలో వర్షంతో బురదగా మారిన కొనుగోలు కేంద్రం, కుప్పలుగా ధాన్యం

- నెలాఖరులోగా పూర్తయ్యేనా..?
- జిల్లాలో వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కుప్పలు
- లారీల కోసం ఎదురుచూపులు

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో ధాన్యం సేకరణ లక్ష్యం నెలాఖరులోగా పూర్తయ్యేలా కనిపించడం లేదు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి నెలన్నర రోజులు గడుస్తుండగా ఇప్పటివరకు సగమే సేకరించారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిల్వలు పేరుకుపోయాయి. మరోవైపు గత పది రోజులుగా అకాల వర్షాలు వెంటాడుతున్నాయి. జిల్లాలో ఉదయం ఎండలు మండుతుండగా.. సాయంత్రం ఏదో ఒక మండలంలో గాలిదుమారం, తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడుతూనే ఉన్నాయి. ఇప్పటికే పలుమార్లు అకాల వర్షానికి రైతులు నష్టపోయారు. మరోమారు భారీ వర్షాలు కురిస్తే చేతికొచ్చిన పంట నీటి పాలవుతుందని వాపోతున్నారు. తూకం వేయని ధాన్యంతోపాటు బస్తాల్లో నింపి లారీలు రాక వేల క్వింటాళ్ల ధాన్యం నిల్వ ఉంది.

లక్ష్యం 1.76 లక్షల మెట్రిక్ టన్నులు

జిల్లాలో 1.76 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా ఏప్రిల్ ఒకటి నుంచి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు. ఇప్పటి వరకు 286 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి 10,998 మంది రైతుల నుంచి రూ.166,18,81,516 విలువైన 75,437.200 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. ఇందులో 69,199.240 మెట్రిక్ టన్నులు ధాన్యం రైస్‌మిల్లులకు తరలించారు.

మూడు సెక్టార్లుగా విభజన

జిల్లాలో విస్తీర్ణం, దిగుబడికి అనుగుణంగా ధాన్యం సేకరణ, మిల్లులకు తరలింపు రవాణాకు అనుగుణంగా మూడు సెక్టార్లుగా విభించారు. సెక్టార్–1లో జన్నారం, దండేపల్లి, లక్సెట్టిపేట, సెక్టార్–2లో హాజీపూర్, మంచిర్యాల, నస్పూర్, జైపూర్, మందమర్రి, బెల్లంపల్లి, తాండూర్, భీమిని, సెక్టార్–3లో కన్నెపల్లి, నెన్నెల, వేమనపల్లి, భీమారం, చెన్నూర్, కోటపల్లి మండలాలు ఉన్నాయి. లారీలు, మిల్లులు, ధాన్యం తరలింపు లక్ష్యం కేటాయించారు. ఇప్పటివరకు సెక్టార్–1లో 60 నుంచి 70 శాతం, సెక్టార్–2లో 40 నుంచి 50 శాతం, సెక్టార్–3లో 30 నుంచి 40 శాతం ధాన్యం సేకరించారు.

గన్నీ బ్యాగులు, లారీలు పక్కదారి

గన్నీ బ్యాగులు సకాలంలో అందకపోవడం, తూకం వేసిన ధాన్యం మిల్లుకు తరలించేందుకు లారీలు అందుబాటులో లేకపోవడంతో కేంద్రాల వద్ద రైతులు ఎదురు చేస్తున్నారు. గన్నీ సంచులు పక్కదారి పడుతున్నాయని, కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు చేయకుండా పలుకుబడి ఉన్న చోటామోటా నాయకుల ధాన్యం కొనుగోలు చేస్తున్నారని, దీంతోపాటు నిర్వాహకులు ఇతర ప్రాంతాల్లో తక్కువ ధరకు ధాన్యం కొనుగోలు చేసి లారీల ద్వారా మిల్లుకు తరలిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. కేంద్రాలకు కేటాయించిన గన్ని బ్యాగులతో ఇతర ప్రాంతాల్లో తక్కువ ధరకు రూ.1600 నుంచి రూ.1800 చొప్పున కొనుగోలు చేసి కొనుగోలు కేంద్రాల్లో ప్రభుత్వ మద్దతు ధర ఏ గ్రేడు రకం రూ.2203, సాధారణ రకం రూ.2183తో మిల్లుకు తరలిస్తున్నారని ఆరోపిస్తున్నారు. అక్రమంగా ధాన్యం కొనుగోళ్లు చేస్తున్న, గన్నీ సంచులు పక్కదారి పట్టిస్తున్న, ట్రాక్‌షీట్‌తో లారీలో లోడ్ పంపిస్తున్నా అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

పది రోజులు అవుతుంది..



సెంటర్‌కు వడ్లు తెచ్చి పది రోజులు అవుతుంది. మొన్నటి వరకు ఎండలు ఉన్నప్పుడు కాంట పెట్టలే.. నాలుగు రోజులుగా ఈదురుగాలులు, వర్షాలు వస్తున్నాయి. భారీ వర్షం వస్తే వడ్లు మొత్తం తడిసి నష్టపోవుడు అవుతుంది. ఆలస్యం చేయకుండా కాంట పెట్టి మిల్లుకు తరలించాలి.
– కుమ్మ బాపుగౌడ్, గ్రామం: కిష్టంపేట్, మం: చెన్నూర్

లారీలు వస్త లేవంటున్నరు..

మూడు ఎకరాల పోలం కోసి వడ్లు సెంటర్‌కు తెచ్చి పది రోజులు అయితంది. లారీలు వస్తలేవు అంటున్నరు. సంచులు లేవని కాంట పెడుతలేరు. ఎన్ని రోజులు అడ్లకాడ ఉండుడో తెలుస్తలేదు. రోజు మబ్బులు పడుతున్నయి. గట్టి వాన పడితే మూడెకరాల పెట్టుబడి రూ.60 వేలు నష్టపోవుడు అయితది. ఆలస్యం చేయకుండా లారీ రప్పించి అడ్లుకొనాలే.
– వెంకటి, గ్రామం: లింగాల, మం: కన్నెపెల్లి

జిల్లాలో ఇప్పటివరకు సేకరించిన ధాన్యం(మెట్రిక్ టన్నులు)

ఏజెన్సీలు	కేంద్రాలు	రైతులు	సేకరించిన ధాన్యం	మిల్లుకు తరలించింది
డీఆర్‌డీఏ	136	7,256	52,178.160	47,362.880
పీఏసీఎస్	89	2,145	11,725.560	10,665.480
డీసీఎమ్మెస్	51	885	6,155.560	5,902.080
మెప్మా	10	712	5,377.920	5,268.800
మొత్తం	286	10,998	75,437.200	69,199.240



డెంగీ దినోత్సవ పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లు విడుదల చేస్తున్న డాక్టర్ అనిత

మంచిర్యాలటౌన్: జాతీయ డెంగీ దినోత్సవం పోస్టర్లను బుధవారం విడుదల చేశారు. జిల్లా అదనపు కలెక్టర్ కార్యాలయంలో జిల్లా అదనపు కలెక్టర్ మోతీలాల్, డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఇంచార్జీ డీఎంహెచ్‌వో డాక్టర్ అనిత, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ హరీశ్‌చంద్రరెడ్డి పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఇంచార్జీ డీఎంహెచ్‌వో మాట్లాడుతూ డెంగీ నివారణలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని, ప్రతీ గ్రామం, పట్టణ ప్రాంతాల్లో నీరు నిల్వ లేకుండా చూడాలని కోరారు. డెంగీపై ప్రతీరోజు ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రజలకు అవగాహన కల్పించాలని, ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బందికి అవగాహన కల్పించడం తప్పనిసరి అన్నారు. జిల్లాలోని అన్ని ఆశ్రమ పాఠశాలలు, ఇతర హాస్టళ్లలో దోమల మందు పిచికారీ చేయించామని, దోమల నివారణకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో డెంగీ కిట్లు అందుబాటులో ఉంచామని, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఎలిజా పరీక్ష ద్వారా డెంగీని పూర్తిగా నిర్ధారించేందుకు సదుపాయాలు ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జీజీహెచ్ ఏడీ ఇస్మాయిల్, డీఎంహెచ్‌వో కార్యాలయ సూపరింటెండెంట్ విశ్వేశ్వర్‌రెడ్డి, నామ్‌దేవ్, సత్యనారాయణ, సంతోష్, మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఒకరి మృతికి కారకులైన ఇద్దరికి జైలుశిక్ష

భీమిని: కన్నెపెల్లి మండలంలోని లింగాల గ్రామ పంచాయతీకి చెందిన చౌదరి వెంకన్న మృతికి కారకులైన ఇద్దరికి జైలుశిక్ష, జరిమానా విధిస్తూ మంచిర్యాల కోర్టు జడ్జి తీర్పునిచ్చినట్లు కన్నెపెల్లి ఎస్సై గంగారం తెలిపారు. లింగాల గ్రామానికి చెందిన చౌదరి వెంకన్న భార్య లక్ష్మి దన్నూరి రాజుతో అక్రమ సంబంధం పెట్టుకోవడంతో మనస్తాపానికి గురైన వెంకన్న 25 మార్చి 2019లో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని సోదరుడు చౌదరి మధుకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై రాజ్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బుధవారం అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ మదన్‌మోహన్, కోర్టు కానిస్టేబుల్ గట్టయ్య నిందితులను కోర్టులో ప్రవేశపెట్టగా నేరం రుజువుకావడంతో చౌదరి లక్ష్మికి ఐదేళ్లు, దన్నూరి రాజుకు మూడేళ్ల జైలుశిక్షతో పాటు ఇరువురికి రూ.వెయ్యి జరిమానా విధించినట్లు ఎస్సై తెలిపారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

నెన్నెల: జెండా వెంకటాపూర్ గ్రామంలోని ఎస్కొరి కృష్ణవేణికి చెందిన కిరాణం షాపులో చోరీకి పాల్పడిన అదే గ్రామానికి చెందిన దూట శశికాంత్‌ను బుధవారం అరెస్టు చేసినట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు. ఏప్రిల్ 2న రాత్రి దుకాణం తలుపులు గడ్డపారతో పగులగొట్టి బీరువాలో ఉన్న ఐదు తులాల బంగారు ఆభరణాలు, రూ.20 వేల నగదు దొంగిలించినట్లు తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఆధారాలు సేకరించామన్నారు. వేలిముద్రల ఆధారంగా నిందితుడిని పట్టుకున్నట్లు తెలిపారు. నిందితుని వద్ద నుంచి బంగారం స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్సై తెలిపారు.

పిడుగు పడి మహిళకు గాయాలు


చికిత్స పొందుతున్న యమునాబాయి

రెబ్బెన: మండలంలోని కొండపల్లిలో బుధవారం సాయంత్రం ఇంటి ముందు పనిచేస్తున్న మహిళపై పిడుగుపడడంతో గాయాలయ్యాయి. బాధితురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం కొండపల్లికి చెందిన సోన్లే యమూనాబాయి తమ ఇంటి ముందు ఉన్న బావి వద్ద పనులు చేసుకుంటోంది. ఈ క్రమంలో ఒక్కసారిగా కురిసిన వర్షానికి పిడుగుపడడంతో గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు కాగజ్‌నగర్‌లోని ఆస్పత్రికి తరలించారు.

సింగరేణి రిటైర్డు కార్మికుడు ఆత్మహత్య

మందమర్రిరూరల్: ఉరేసుకుని సింగరేణి రిటైర్డు కార్మికుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం రామకృష్ణాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని వెంకటాపూర్‌కు చెందిన సల్లూరి బానయ్య (59) అనే సింగరేణి రిటైర్డ్ కార్మికుడి భార్య ఎనిమిదేళ్ల క్రితం మృతి చెందింది. దీంతో మనస్తాపానికి గురై మద్యానికి బానిసయ్యాడు. బుధవారం ఇంట్లో దూలానికి చీరతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుని కుమారుడు రాజ్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

పరిశుభ్రతే మహాభాగ్యం

- ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి
- దోమల నివారణతోనే విషజ్వరాల వ్యాప్తి అంతం
- నేడు డెంగీ నివారణ దినోత్సవం

జిల్లాలో చేసిన డెంగీ పరీక్షలు, నమోదైన కేసులు

సంవత్సరం	పరీక్షలు	డెంగీ కేసులు
2020	522	32
2021	2046	118
2022	2502	116
2023	1350	74
2024	20	1



డెంగీపై అవగాహన కరపత్రం


జిల్లా కేంద్రంలోని హైటెక్‌సిటీ కాలనీలో నిల్వ ఉన్న నీరు

మంచిర్యాలటౌన్/కౌటాల: 'ఆరోగ్యమే మహాభాగ్యం'అన్న నానుడి నిజం కావాలంటే... ముందుగా మన చుట్టూ ఉన్న పరిసరాలతో పాటు మన ఇంటినీ పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచిస్తున్నారు వైద్యులు. వ్యక్తిగత శుభ్రతతో పాటు జీవించే ఇల్లు, ఆవరణ, చుట్టూ ఉన్న ప్రదేశం ఎంత పరిశుభ్రంగా ఉంటే అంత మంచిదని, అప్పుడే డెంగీ దోమలు వృద్ధి చెందకుండా, ప్రాణాలు తీసే జ్వరాల బారిన పడకుండా రక్షించబడతారు. డెంగీ పేరు వింటేనే జనానికి దడపుడుతోంది. వర్షాకాలం మొదలైందంటే సీజనల్ వ్యాధులతో పాటు, డెంగీ బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. ఇంటి పరిసరాల్లో కొబ్బరి బోండాలు, వాహనాల పాత టైర్లు, కొబ్బరి చిప్పలు, కూలర్లు, నీటి తొట్టిలు, పూలకుండీలలో నీరు నిల్వ ఉంటే అందులో ఎడిస్ ఈజిప్టి అనే డెంగీ దోమ వృద్ధి చెందుతుంది. పగటి పూట కుట్టే ఈ దోమ వల్లనే డెంగీ జ్వరం వస్తుంది. ఈ దోమను టైగర్ దోమ అని కూడా పిలుస్తారు.

డెంగీ లక్షణాలు

- ఏడిస్ ఈజిప్ట్ అనే దోమ కుట్టిన తరువాత నాలుగు నుంచి పదిరోజుల మధ్య డెంగీ లక్షణాలు బయటపడతాయి.
- తీవ్రమైన జ్వరంతో ఈ వ్యాధి మొదలవుతుంది.
- కళ్లు కదిలించలేని పరిస్థితి ఉంటుంది.
- ఎముకలు, కండరాల్లో భరించలేని నొప్పి, శరీరంపై పొక్కులు వస్తాయి.
- వాంతులు, వికారం, రక్తంతో కూడిన మల విసర్జన ప్రధాన లక్షణం
- ఈ లక్షణాలు నాలుగు నుంచి ఆరు రోజులు కొనసాగుతాయి.
- డెంగీ లక్షణాలు ఉంటే బీపీ పడిపోతుంది. రక్త కణాలు తగ్గుతాయి. ఇవన్నీ ఐదు నుంచి ఏడు రోజుల మధ్య జరుగుతాయి.
- మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో మాత్రమే దీని నిర్ధారణ పరీక్ష అందుబాటులో ఉంది.

చికిత్స

- వైరస్ వల్ల కలిగే ఈ వ్యాధులకు పూర్తి చికిత్స లేదు.
- లక్షణాలను బట్టి వైద్యులతో ఉపశమన చర్యలు చేపట్టాలి.
- డెంగీ వ్యాధికి వైద్యం ఆలస్యం చేస్తే ప్రాణాంతకంగా మారుతుంది.
- రక్త నమూనాలను పరీక్షించి వ్యాధి నిర్ధారణ చేయాలి.

దోమల నివారణ ఇలా..

- దోమ తెరలు వాడటం, ఇంటికి కిటికీలకు, తలుపులకు జాలీలను బిగించడం.
- ఇంటి లోపల, బయట నీటి నిల్వలు లేకుండా జాగ్రత్త వహించడం.
- నీటి తొట్టెలను వారం రోజులకోసారి ఖాళీ చేసి శుభ్రం చేయడం.
- తాగి వదిలేసిన కొబ్బరి బోండాలు, పాత టైర్లు, ఖాళీ డబ్బాలు, పనికిరాని వస్తువుల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలి.
- కూలర్లు, ఫ్లవర్‌వాజ్, పూలకుండీలలో నీటిని తరచూ మార్చాలి.
- నీటి నిల్వలో దోమలు వృద్ధి చెందకుండా టిమిసాస్ మందు స్ప్రే చేయాలి.

ఇది ఒకరి నుంచి మరొకరికి ఏడిస్ ఈజిప్ట్ దోమ కాటు ద్వారా డెంగీ వ్యాపిస్తుంది. జ్వరం, హేమరేజ్, షాక్ సిండ్రోమ్ అనే మూడు దశల్లో డెంగీ తీవ్రత ఉంటుంది. ఏమాత్రం అశ్రద్ధ చేసినా ప్రాణాలకు ముప్పు తప్పదని వైద్యులు హెచ్చరిస్తున్నారు. కేవలం రాపిడ్ డయాగ్నోస్టిక్స్ కిట్‌ల ద్వారా మాత్రమే డెంగీ లక్షణాలను గుర్తిస్తారు. పూర్తిగా నిర్ధారణ చేసేందుకు మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో, టీహబ్‌లో ఎలిజా టెస్టు చేసేందుకు అవకాశం ఉందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు చెబుతున్నారు. ప్రైవేటు ఆస్పత్రుల్లో కేవలం డెంగీ కిట్‌లతో పరీక్షించి రక్తకణాలు తగ్గుతున్నాయంటూ, డెంగీ వైద్యం పేరిట లక్షలాది రూపాయల ఫీజులు వసూలు చేస్తున్నారు. రోజుల తరబడి ఆస్పత్రిలో ఉండి చికిత్సకు లక్షలాది రూపాయలు ఖర్చు చేసుకోవడం కంటే, నిరంతరం ఇంట్లో, ఇంటి పరిసరాల్లో నీటి నిల్వ లేకుండా చూసుకోవడంతో పాటు, పరిశుభ్రంగా ఉంచుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.


నిల్వ నీటిలో దోమల మందు చల్లుతున్న వైద్య సిబ్బంది(ఫైల్)

జాగ్రత్తలు తీసుకుంటున్నాం



గతేడాది ఎక్కడ డెంగీ కేసులు నమోదయ్యాయో అక్కడ మరిన్ని జాగ్రత్తలు తీసుకుంటాం. ములక్లల్ల, దేవాపూర్, మంచిర్యాల మున్సిపాలిటీల్లో ఎక్కువగా డెంగీ కేసులు నమోదయ్యాయి. ప్రతి బుధ, శనివారాల్లో అన్ని పీహెచ్‌సీలలో ఆరోగ్యంపై అవగాహనతో పాటు డెంగీ వ్యాధి గురించి వివరిస్తున్నాం. డెంగీ నిర్ధారణకు సంబంధించిన రాపిడ్ డయాగ్నోస్టిక్స్ కిట్స్‌లను అన్ని ప్రభుత్వ ఆస్పత్రులు, సబ్ సెంటర్‌లకు ఇచ్చాం. మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి, టీహబ్‌లలో డెంగీ పూర్తి నిర్ధారణ కోసం ఎలిజా టెస్టు చేస్తున్నాం.

– డాక్టర్ అనిత, ఇన్‌చార్జి జిల్లా వైద్యాధికారి

అవగాహన కల్పిస్తున్నాం



జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఆరోగ్య కార్యకర్తలు, గ్రామస్థాయిలో ఆశ కార్యకర్తల సహకారంతో బృందాలను ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. ఈ బృందాలతో యాంటీలార్వా ఆపరేషన్స్, డెంగీపై అవగాహన కార్యక్రమాలు చేపట్టడం వల్ల జిల్లాలో డెంగీని సాధ్యమైనంత వరకు తగ్గించాం. గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు, సామాజిక కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు డెంగీపై ప్రజలకు అవగాహన కల్పించాలి.

– డాక్టర్ సుధాకర్ నాయక్, జిల్లా మలేరియా అధికారి, ఆసిఫాబాద్

ప్రథమ చికిత్స కేంద్రాల్లో తనిఖీ

మందమర్రిరూరల్: మందమర్రి పట్టణంలోని పలు పీఎంపీ, ఆర్‌ఎంపీ ఆస్పత్రులు, ప్రథమ చికిత్స కేంద్రాల్లో తెలంగాణ స్టేట్ మెడికల్ కౌన్సిల్ విజిలెన్స్ అధికారుల బృందం బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించింది. పాల చెట్టు, మార్కెట్ ఏరియాల్లో రోగులకు ఎలాంటి వైద్యం అందిస్తున్నారు, ఎలాంటి సౌకర్యాలు ఉన్నాయనే విషయాలపై ఆరా తీశారు. అనుమతి లేకుండా వైద్యం అందించే పీఎంపీ, ఆర్‌ఎంపీలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని సూచించారు.

నమూనా పరీక్షలకు రిజిస్ట్రేషన్

మంచిర్యాలటౌన్: టీఎస్‌పీఎస్సీ గ్రూప్ 1 ప్రిలిమ్స్, యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమ్స్ నమూనా పరీక్షల కోసం అభ్యర్థులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి వినోద్‌కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని అభ్యర్థులకు నమూనా పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. గ్రూప్-1 నమూనా పరీక్షలను ఆదిలాబాద్‌లోని బీసీ స్టడీ సర్కిల్‌లో ఈ నెల 18, 20, 22, 24, 25, 27, 29, 31, జూన్ 1, 3 తేదీల్లో, సివిల్ సర్వీసెస్ నమూనా పరీక్షలను హైదరాబాద్‌లో ఈ నెల 23, 26, 28, 30, జూన్‌2, 4, 6, 8, 10, 12 తేదీల్లో నిర్వహిస్తామని తెలిపారు. దరఖాస్తులను ఆన్‌లైన్‌లో https:// tsbcstudycircle. cgg. gov. in/ firstpage. do వెబ్‌సైట్ ద్వారా సమర్పించాలని, వివరాలకు 08732–221280 నంబరులో సంప్రదించాలని తెలిపారు.

దాడి చేసిన పలువురిపై కేసు

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్ స్టేషన్ పరిధిలోని పిట్టల్‌వాడకు చెందిన జాదవ్ గోపాల్‌పై దాడి చేసిన పలువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై విష్ణు వర్ధన్ తెలిపారు. పిట్టల్‌వాడకు చెందిన జాదవ్ గోపాల్ బుధవారం దుర్గనగర్ కాలనీ నుంచి ద్విచక్ర వాహనంపై పిట్టల్‌వాడకు వస్తుండగా 170 కాలనీకి చెందిన అజయ్ మహాకాల్‌తో పాటు పలువురు కర్రలు, రాడ్లతో దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు అజయ్‌తో పాటు పలువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ప్రాణం తీసిన వివాహేతర సంబంధం

- హాజీపూర్ మండల కేంద్రంలో ఒకరి దారుణహత్య


నరేష్ (ఫైల్)

మంచిర్యాలరూరల్(హాజీపూర్): వివాహేతర సంబంధం ఒకరి ప్రాణం తీసింది. అక్రమ సంబంధం కారణంగా ఒకరిని దారుణంగా హత్య చేసిన సంఘటన హాజీపూర్ మండల కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన మల్యాల నరేష్ (32), నిరోషా దంపతులకు 8 నెలల కుమార్తె సంతానం. ప్రస్తుతం నిరోషా మళ్లీ గర్భం దాల్చడంతో పుట్టింటికి వెళ్లింది. నరేశ్ కొంతకాలంగా స్థానికంగా ఉన్న ఓ వివాహితతో అక్రమ సంబంధం కొనసాగిస్తున్నాడు. సదరు మహిళ సోదరుడు చైతన్యకు విషయం తెలియడంతో తీవ్రంగా మందలించాడు. అయినా పట్టించుకోకుండా అక్రమ సంబంధం కొనసాగిస్తూ వస్తున్నాడు. మంగళవారం రాత్రి నరేష్ తన సోదరితో ఉన్నట్లు సమాచారం తెలుసుకున్న చైతన్య మద్యం సేవించి నేరుగా ఇంటికి వెళ్లి నరేష్‌తో గొడవకు దిగాడు. గట్టిగా తోసేయడంతో నరేష్ కిందపడి పోగా చైతన్య పక్కనే ఉన్న బండరాయితో కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న మంచిర్యాల రూరల్ సీఐ ఆకుల అశోక్, హాజీపూర్ ఎస్సై గోపతి సురేష్ సంఘటన స్థలాన్ని సందర్శించి మృతదేహాన్ని మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుని తండ్రి నర్సయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడు చైతన్యను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ అశోక్ తెలిపారు.


మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ అశోక్, ఎస్సై

ముగిసిన బ్యాడ్మింటన్ శిక్షణ

మంచిర్యాలటౌన్: జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని రంగంపేట్‌లోని మాస్టర్(రూబీ) బ్యాడ్మింటన్ అకాడమీలో గత నెల 29న ప్రారంభమైన ఉచిత బ్యాడ్మింటన్ శిక్షణ శిబిరం బుధవారం ముగిసింది. ఈ కార్యక్రమానికి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ సెక్రెటరీ పుల్లూరి సుధాకర్, ఆర్థోపెడిక్ వైద్యుడు ప్రవీణ్‌కుమార్ హాజరై క్రీడాకారులకు మెడల్స్ అందజేశారు. బ్యాడ్మింటన్ అసోసియేషన్ ట్రెజరర్ సత్యపాల్‌రెడ్డి, జాయింట్ సెక్రెటరీ మధు, రూబీ బ్యాడ్మింటన్ అకాడమీ బాధ్యుడు నరసింహస్వామి, కోచ్ సాయినాథ్ పాల్గొన్నారు.


ఉచిత శిక్షణ ముగింపులో పాల్గొన్న చిన్నారులు

అండగా దోస్త్.. కోర్సులు మస్త్

- కొనసాగుతున్న తొలివిడత ప్రవేశాల ప్రక్రియ
- ఉమ్మడి జిల్లాలో 13 ప్రభుత్వ, 30కి పైగా ప్రైవేటు డిగ్రీ కళాశాలలు



నిర్మల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల

నిర్మల్‌ఖిల్లా: ఇంటర్ ఉత్తీర్ణులైన విద్యార్థులు డిగ్రీ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి దోస్త్ (డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ ఆఫ్ తెలంగాణ) ప్రక్రియ కొనసాగుతోంది. ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కళాశాలల్లో 2024–25 విద్యా సంవత్సరానికి గానూ బీఏ, బీకాం, బీఎస్సీ, బీసీఏ, బీబీఏ, బీబీఎం, తదితర కోర్సుల్లో ప్రవేశానికి రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగుతోంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని డిగ్రీ కళాశాలలన్నీ కాకతీయ విశ్వవిద్యాలయం పరిధిలో ఉన్నాయి. దరఖాస్తు చేసుకునే విద్యార్థుల సందేహాల నివృత్తికి ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో సహాయ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆన్‌లైన్‌లో వివరాలు నమోదులో జాగ్రత్తగా వ్యవహరించాలని, తప్పుగా నమోదు చేసినట్లు నిర్ధారించుకుంటే హెల్ప్‌లైన్ కేంద్రాలను సంప్రదించాలని కోరుతున్నారు.

సంప్రదాయ కోర్సులకు డిమాండ్..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మొత్తం 13 ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు, దాదాపు 30 వరకు ప్రైవేటు డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. ఇందులోని అన్ని రకాల కోర్సుల్లో కలిపి దాదాపు 18 వేలకు పైగా సీట్లు అందుబాటులో ఉన్నట్లు సంబంధిత అధికారులు పేర్కొంటున్నారు. డిగ్రీలో సంప్రదాయ కోర్సులకు ఆదరణ ఎక్కువగా ఉంది. మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం కొత్తరకం ఉపాధి కోర్సులను కూడా ప్రారంభిస్తోంది.

ప్రవేశాలు మూడు దశల్లో...

డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలు మూడు విడతల్లో జరగనున్నాయి. మే 6 నుంచి మొదటి ఫేజ్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమైంది. రూ.200 రుసుంతో రిజిస్ట్రేషన్‌కు అవకాశం కల్పించారు. ఈ నెల 20 నుండి 30 వరకు వెబ్ ఆప్షన్లు ఇవ్వాలి. జూన్ 6న తొలి విడత సీట్ల కేటాయింపు ఉంటుంది. జూన్ 7 నుండి 12 వరకు కేటాయించబడిన కళాశాలల్లో సెల్ఫ్ రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది. నిర్దేశించిన తేదీల ప్రకారం రెండవ దశ, మూడవ దశ లో అడ్మిషన్ ప్రక్రియ కొనసాగుతుంది.

రెండో దశ..

రూ.400 రుసుంతో జూన్ 6 నుంచి 13 వరకు సెకండ్ ఫేజ్ రిజిస్ట్రేషన్ నిర్వహించనున్నారు. జూన్ 6 నుంచి 14 వరకు సెకండ్ ఫేజ్ వెబ్ ఆప్షన్లు ఉంటాయి. జూన్ 18న రెండో దశ సీట్ల కేటాయింపు జరుగుతుంది. జూన్ 19 నుంచి 24 వరకు సెల్ఫ్ రిపోర్టుకు అవకాశం కల్పించారు.

మూడో దశ..

జూన్ 19 నుంచి 25 వరకు 'దోస్త్' మూడో దశ రిజిస్ట్రేషన్ ఉండనుంది. రూ.400 రుసుంతో మూడో విడత రిజిస్ట్రేషన్‌కు అవకాశం కల్పించారు. జూన్ 19 నుంచి 25 వరకు మూడో దశ వెబ్ ఆప్షన్లు ఉంటాయి. జూన్ 29న మూడో దశ సీట్ల కేటాయింపు జరుగుతుంది. జులై 8 నుంచి డిగ్రీ కళాశాలల తరగతులు ప్రారంభమవుతాయి.

మొబైల్ యాప్ ద్వారా కూడా దరఖాస్తు..

మొబైల్ యాప్ ద్వారా కూడా దోస్త్ దరఖాస్తు చేసుకోవచ్చని హెల్ప్ డెస్క్ అధికారులు పేర్కొంటున్నారు. స్మార్ట్‌ఫోన్లలోని ప్లే స్టోర్ నుంచి డిగ్రీ దోస్త్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఇందులో సూచించిన ప్రకారం మొబైల్ నంబర్ ఓటీపీతో వెబ్‌సైట్లోకి ప్రవేశించి సంబంధిత రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేయవచ్చు. వెబ్ ఆప్షన్ల తర్వాత ఏ కాలేజీలో సీట్ అలాట్ అయిందో కూడా తెలుసుకోవచ్చు. వెబ్ ఆప్షన్స్ నమోదు సమయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని సమీపంగా ఉన్న వాటిని ముందుగా ఎంచుకుని ఆ తర్వాత ప్రాధాన్యత క్రమంలో దూరంగా ఉన్న వాటిని పెట్టుకోవాలని సూచిస్తున్నారు. కోర్సులు కూడా తమకు నచ్చిన వాటిని తొలుత, ఆ తర్వాత ప్రాధాన్యత క్రమంలో ఎంపిక చేసుకోవాలని కోరుతున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి



ప్రస్తుతం పోటీ ప్రపంచంలో ఎన్నో కొత్త కోర్సులు అందుబాటులోకి వస్తున్నాయి. వృత్తి విద్యా కోర్సులతో పాటు సంప్రదాయ డిగ్రీ కోర్సులకు సైతం డిమాండ్ ఉంది. కిందిస్థాయి ఉద్యోగాల నుంచి సివిల్స్ వరకు జరిగే పోటీ పరీక్షలలో డిగ్రీ సిలబస్ నుంచే ప్రశ్నలు వస్తున్నాయి. డిగ్రీ కనీస అర్హతగా కొనసాగుతోంది కాబట్టి విద్యార్థులు కోర్సును ఎంచుకునే ముందు ఆలోచించి ఎంపిక చేసుకోవాలి. పట్టుదలతో శ్రమించి తగిన నైపుణ్యాలు పెంపొందించుకుంటే భవిష్యత్‌లో మంచి రంగంలో స్థిరపడేందుకు అవకాశం ఉంటుంది.

– డా.రవికుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్, దోస్త్ జిల్లా సమన్వయకర్త, నిర్మల్

ప్రకృతి వనాలపై ఉగ్రరూపం

- తాటి, ఈత చెట్లపై నిప్పులు కురిపిస్తున్న భానుడు
- ఎండ తీవ్రతకు మాడిపోతున్న చెట్లు
- కల్లు పారకం తగ్గి ఉపాధి కోల్పోతున్న గీత కార్మికులు


ఎండిపోయి నిర్జీవంగా తాటి చెట్ల కమ్మలు

బెల్లంపల్లి: ప్రకృతి పరంగా అత్యంత సహజ సిద్ధంగా కల్లును అందించే ఈత, తాటి వనాలపై భానుడు ఉగ్రరూపం ప్రదర్శిస్తున్నాడు. ఎండ తీవ్రతకు కల్లు పారకం చెట్లు విలవిలలాడుతున్నాయి. ఏపుగా ఎదిగిన చెట్లు కళ్ల ముందే నిలువున ఎండి పోయి నిర్జీవంగా మారుతుండటంతో వాటిపై ఆధారపడిన గీత వృత్తిదారులు (గౌడ కులస్తులు) ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికే అనేకమంది గీత వృత్తిని వదులుకుని ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలను ఎంచుకుంటున్నారు.

నిలువునా ఎండిపోతూ..

వేసవి తీవ్రత మానవులపైనే కాదు పశుపక్ష్యాదులతోపాటు వృక్షాలపై సైతం తీవ్ర ప్రభావం చూపుతోంది. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిప్పుల వర్షం కురిపిస్తున్నాడు. జిల్లాలో పగటి ఉష్ణోగ్రత గరిష్ఠంగా 42 డిగ్రీల నుంచి 45 డిగ్రీలకు పైగా నమోదవుతోంది. నిప్పుల కుంపటిగా మారుతుండటంతో తాటి, ఈత వనాలు తాళలేకపోతున్నాయి. చెట్టు మొగి (చివరి) భాగం ఎండ తీవ్రతకు మాడిపోతున్నాయి. తాటాకులు పచ్చదనం కోల్పోయి నిర్జీవంగా మారుతున్నాయి. ఈత చెట్ల పరిస్థితి కూడా దయనీయంగా ఉంది. దినదినం భూగర్భ జలాలు అండుగంటి పోతుండటంతో ఈత, తాటి వనాలకు సరిపడినంత నీరు అందడంలేదు.

కల్లు పారకంపై ప్రభావం

మండు వేసవిలోనూ తాటి, ఈత వనాలు కల్లును అందిస్తాయి. ఈ సీజన్‌లో తాటి చెట్లను పండుతాళ్లు అని సంబోధిస్తారు. ప్రకృతి తాటిచెట్లకు ముంజలు, ఈత చెట్లకు పండ్లను ప్రసాదిస్తుంది. ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో చెట్ల నుంచి కల్లు పారకం తగ్గుముఖం పడుతోంది. దశాబ్దకాలం క్రితం వరకు ఎండాకాలంలోనూ ఒక్కో తాటి చెట్టు రోజుకు గరిష్ఠంగా 8 లీటర్ల నుంచి 10 లీటర్ల వరకు కల్లు పారగా కొంతకాలం నుంచి ఎండ తీవ్రతకు 3 లీటర్లకు మించి కల్లు పారడం లేదని గీత వృత్తిదారులు వాపోతున్నారు. ఈ పరిణామాల ప్రభావంతో అనేకమంది గీత వృత్తిదారులు ఉపాధి లేక అనాదిగా వస్తున్న గీత వృత్తిని వదులుకుని ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకుంటున్నారు. బతుకు దెరువు కోసం ఇతర ప్రాంతాలకు వలసపోతున్నారు. కులవృత్తిపై ఆధారపడిన గీత కార్మికుల జీవనోపాధిని పెంపొందించడానికి ప్రభుత్వం తగిన సహాయ సహకారాలు అందించాలని కోరుతున్నారు.

జిల్లాలో వనాల సంతతి

తాటి, ఈత వనాలు జిల్లా నలుమూలల వ్యాపించి ఉన్నాయి. జిల్లాలో 18 మండలాలు ఉండగా వీటి పరిధిలో 1,76,891 ఈత చెట్లు , 37,016 తాటి చెట్లు ఉండగా 2,016 మంది గీత వృత్తి దారులు జీవనోపాధి పొందుతున్నట్లు ఎక్సైజ్ శాఖ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

3 లీటర్లకు మించి పారుతలేదు



ఎండల తీవ్రతకు పండుతాళ్ల నుంచి కల్లు సరిగా పారుతలేదు. పదేళ్ల క్రితం ఉన్న పరిస్థితులు ఇప్పుడు లేవ్. పండుతాళ్లు అప్పట్ల దినాం పది లీటర్లకు తక్కువ కాకుండా కల్లు పారేటివి. ఇప్పుడు రోజుకు 3 లీటర్లు కూడా పారడం గగనమవుతోంది.

– ములుగూరి సురేందర్‌గౌడ్, గీత వృత్తి దారుడు